ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

3★

శనివారం 30 నవంబరు 2024

న్యూస్ బాక్స్

1న జిల్లా స్థాయి ఉమెన్స్ కబడ్డీ పోటీలు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో డిసెంబర్ 1న కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమెన్స్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 7 నుంచి 10వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. వెంట వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శంకర్, వైస్‌ప్రెసిడెంట్ రమేష్‌గౌడ్, సెక్రటరీ కరుణాకర్, జాయింట్ సెక్రటరీ షఫీ, కృష్ణయ్య, శంకర్ తదితరులున్నారు.

2 నుంచి టాస్క్ సెంటర్‌లో శిక్షణ తరగతులు

పెద్దపల్లి కల్చరల్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్ కేంద్రంలో మొదటి బ్యాచ్ శిక్షణ తరగతులు డిసెంబరు 2 నుంచి ప్రారంభమవుతాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల యువతీయువకులు టాస్క్ రీజనల్ సెంటర్‌లో క్లాసులకు హాజరు కావాలని పేర్కొన్నారు. టాస్క్ అనేది పరిశ్రమకు నాణ్యమైన మానవ వనరు లు, సేవలందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సంస్థ అని పేర్కొన్నారు. డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన విద్యార్థులు శిక్షణ కోసం పేరు నమోదు చేసు కొని డిసెంబరు 2నుంచి తరగతులకు హాజరుకావాలని పెద్దపల్లి రీజినల్ సెంటర్ హెడ్ నవీన్‌రెడ్డి తెలిపారు. వివరాలకు 9182117078, 9395113738 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని అన్నారు.

సీఎం సభకు భారీ సన్నాహాలు



- కలెక్టరేట్‌కు సమీపంలోనే సభ.. 50వేల మంది తరలింపు
- సభాస్థలికి పక్కనే తాత్కాలిక హెలిప్యాడ్ నిర్మాణం
- ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం
- జన సమీకరణకు కాంగ్రెస్ పార్టీ నేతల సమావేశాలు



పెద్దపల్లి పట్టణ శివారులో సీఎం సభ నిర్వహించనున్న స్థలం



సీఎం సభాస్థలి వద్ద సీపీతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా వచ్చేనెల 4వ తేదీన పెద్దపల్లిలో నిర్వహించనున్న యువత విజయోత్సవ సీఎం సభకు సుమారు 50వేల మందిని తరలించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సభను పెద్దపల్లి పట్టణం రంగంపల్లి శివారులో కలెక్టరేట్‌కు సమీపంలోగల ఖాళీస్థలంలో సభ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లుగా చేసిన స్థలంతో పాటు రైతులకు చెందిన వ్యవసాయ భూముల్లో సభ నిర్వహించాలని నిర్ణయించారు. దాదాపు 40 ఎకరాలకు పైగా ఖాళీ స్థలం ఉండడం గమనార్హం. సభా ప్రాంగణానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చేందుకు రోడ్లను సిద్ధం చేస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల నుంచి కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత శాఖాధికారులతో స్థల పరిశీలన చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులుతో కూడా సభాస్థలిని సందర్శించారు. పోలీస్ భద్రతా ఏర్పాట్లను ఎక్కడెక్కడ వాహనాలను పార్కింగ్ చేయాలి, హెలిప్యాడ్ ఎక్కడ నిర్మించాలి, సభాస్థలికి వచ్చే రోడ్ల నిర్మాణాలు, తదితర అంశాలను పరిశీలించి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా పెద్దకల్వల పరిధిలో గతంలో కేసీఆర్ నిర్వహించిన స్థలంలోనే సభ నిర్వహించాలని భావించినప్పటికీ, ప్రధాన రహదారి నుంచి సభా ప్రాంగణానికి నడిచి వెళ్లేందుకు చాలా దూరం ఉందని భావించిన అధికారులు, ఎమ్మెల్యే విజయరమణారావులు రంగంపల్లి శివారులోగల స్థలం మెయిన్ రోడ్డుకు చాలా దగ్గరగా ఉందని భావించి అక్కడే సభను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సభలో 9వేల మంది గ్రూపు-4 ఉద్యోగులకు నియామక...

మిగతా 8వ పేజీలో... ..

రైతు పండుగ ప్రత్యక్ష ప్రసారం : కలెక్టర్

పెద్దపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు పండుగ మహాసభ కార్యక్రమాన్ని జిల్లాలోని 14 రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం నిర్వహిస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారని, ఈ కార్యక్రమం జిల్లాలోగల గుండారం, ముత్తారం, గుంజపడుగు, రత్నాపూర్, ఎలిగేడు, తెలుకుంట, రాఘవాపూర్, కాట్నపల్లి, శ్రీరాంపూర్, ఓదెల, బ్రాహ్మణపల్లి, ఎలకలపల్లి, మేడిపల్లి, బోట్లవనపర్తి రైతు వేదికలలో ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులు అందరూ తమ గ్రామాలకు సమీపంలో ఉన్న రైతు వేదికలకు తరలివచ్చి ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించాలని కలెక్టర్ కోరారు.

జాతీయ రహదారి భూముల్లో ట్రెంచ్ కట్టింగ్

మంథని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల-వరంగల్ జాతీయ రహదారి ఎన్‌హెచ్-163 నిర్మాణానికి సేకరించిన మండలంలోని కన్నాల-పందులపల్లి భూముల్లో జాతీయ రహదారుల అథారిటీ ట్రెంచ్ కట్టింగ్ పనులు ప్రారంభించినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం తెలిపారు. మంచిర్యాల-వరంగల్-ఖమ్మం జిల్లాలను కలిపే 4లైన్ల గ్రీన్‌ఫీల్డు నేషనల్ హైవే కోసం సేకరించిన భూములను ఎన్‌హెచ్‌ఆర్‌ఏకి అప్పగించామన్నారు. దీంతో వారు ట్రెంచ్ కట్టింగ్ పనులను ప్రారంభించారన్నారు. నేషనల్ హైవే నిర్మాణ పనులు సకాలంలో పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం వారికి సహకరించాలన్నారు.

జేఎన్టీయూలో జాతీయ స్థాయి వర్క్‌షాప్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది

రామగిరి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో డిసెంబరు 6,7 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి వర్క్‌షాప్ పోస్టర్‌ను శుక్రవారం ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది ఆవిష్కరించారు. రెండు రోజులు జరిగే వర్క్‌షాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులకు వారణాసి ఐఐటీ వారితో సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని ఇంజనీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ సలహాదారు స్వప్న, స్టూడెంట్ కో-ఆర్డిటర్స్ లోకేష్, శ్రీనాథ్, లావణ్య, సంగీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రామగిరిఖిల్లాను సందర్శించిన అధికారులు



హనుమాన్ దేవాలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రామగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరిఖిల్లాను దేవాదాయశాఖ అధికారులు సందర్శించారు. రామగిరిఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో రూ.5 కోట్లు విడుదల చేశారు. అందులో భాగంగా శుక్రవారం దేవాదాయ శాఖ అధికారులు గుట్టపై ఉన్న రామాలయం, ఆంజనేయస్వామి విగ్రహాలను పరిశీలించారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ ఇంజనీరు సంతోష్‌రెడ్డి, స్థపతి వెంకటేశ్వర్లు, ఆలయాల నిర్మాణం పనుల కోసం కొలతలు తీసుకున్నారు. వెంట అర్చకుడు సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, మంథని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, నాయకులు ముస్త్యాల శ్రీనివాస్, మోత్కూరి అవినాష్‌గౌడ్, గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో అర్ధరాత్రి పోలీసుల తనిఖీలు



రైల్వే ట్రాక్ వెంట తనిఖీ చేస్తున్న పోలీసులు

కోల్‌సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో గురువారం అర్ధరాత్రి వన్‌టౌన్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. వన్‌టౌన్ పరిధిలోని కాలనీల్లో, జన సంచారంలేని ప్రదేశాలు, రైల్వే ట్రాక్‌లు, ఖాళీ భవనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించే వారే లక్ష్యంగా ఈ తనిఖీలు జరిగాయి. అలాగే కాలనీల్లో జులాయిగా తిరిగే వారిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వివిధ కాలనీల్లో బైక్‌లపై పెట్రోలింగ్ చేస్తూ జులాయిలను అదుపులోకి తీసుకున్నారు. వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.



కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సీఎం సభ విజయవంతానికి కృషి చేయాలి..

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

6

రాష్ట్రంలో అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన..

- బీఆర్‌ఎస్ హయాంలో 2.22 లక్షల మందికి ఉద్యోగాలు
- ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకున్నా 55 వేలు ఇచ్చామని అబద్ధాలు
- చారిత్రక ఘట్టంగా నిలవనున్న దీక్షా దివస్
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



దీక్షా దివస్‌కు హాజరైన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలన అస్తవ్యస్తంగా మారిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన చారిత్రక ఘట్టం దీక్షా దివస్ అని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రికార్డు స్థాయిలో 2.22లక్షల ఉద్యోగాలు వచ్చాయని, ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా 55వేల ఉద్యోగాలు ఇచ్చామని అబద్ధాలు చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పాదయాత్రలు, రహదారుల దిగ్బంధం, రాస్తారోకోలు, ఎన్నో నిరసనలతో తెలంగాణ ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. దేశమే ఆశ్చర్యపోయే విధంగా జరిగిన ఆనాటి ఉద్యమాన్ని గుర్తుచేసుకోవడానికే దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అప్పటి సీఎం చంద్రబాబు నేతృత్వంలో రైతులకు వ్యతిరేకంగా కరెంట్ బిల్లు పెట్టేందుకు తీర్మానం చేయగా దాని వ్యతిరేకించిన కేసీఆర్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారని అన్నారు. బీడు భూములు, నిరుద్యోగ సమస్య పోవాలంటే తెలంగాణ తప్పక రావాలని నమ్మిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. ఎంతోమంది ఉద్యమాన్ని చేసిన వారు విఫలమయ్యారని, తెలంగాణ రావడానికి అంతిమ నిర్ణయం దీక్ష దివస్ అన్నారు. 2008లో 16 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు, నలుగురు శాసనమండలి సభ్యులు రాజీనామా చేశారన్నారు. ప్రజలే చైతన్యులై మళ్లీ రాజీనామా చేసిన వాళ్లను గెలిపించారన్నారు. ఎన్నికయ్యారు 2010లో మరొక్కసారి పదవులు త్యాగం చేశారన్నారు. తెలంగాణ అంతా ఆషామాషీగా రాలేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ వ్యతిరేకి అని, ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన వ్యక్తి అని, ఆంధ్రుల అడుగులకు మడుగులు ఒత్తిన ఘనత రేవంత్‌కే దక్కుతుందని, ఆయన రాష్ట్రానికి సీఎం కావడాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఉద్యమాలతో వచ్చిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వ 11 నెలల పాలనతో అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. పది సంవత్సరాలు నిరంతరం అభివృద్ధి చేసి ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లు, చెరువులు, కుంటలను అభివృద్ధి చేయడం, 24గంటలు కరెంట్ ఇవ్వడం వల్లనే రాష్ట్రంలో రికార్డు స్థాయిలో వరి పంట పండిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేసిందని తమ ఘనతగా చెప్పుకుంటుందని ప్రశ్నించారు. తమ హయాంలో 2.22 లక్షల ఉద్యోగాలు కల్పిస్తే, ఉద్యోగాలు ఇవ్వలేదని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకున్నా 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గు చేటు అని అన్నారు. వచ్చే నాలుగేళ్లు తీవ్రమైన ఉద్యమం చేయాల్సి ఉంటుందని, అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ ఎంతో మంది బలిదానాలతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి తెలంగాణ రాష్ట్రం కల సాకారం కావడానికి నాంది పలికిందన్నారు. తెలంగాణ ద్రోహిగా ఉన్న రేవంత్‌రెడ్డి సీఎంగా కొనసాగుతున్నారని దుయ్యబట్టారు. ఏ స్వార్థం లేకుండా కేసీఆర్ స్వయంగా దీక్ష దివస్ ఉద్యమానికి పిలుపు ఇస్తే ప్రతి ఒక్కరు భాగస్వాములై తెలంగాణ సాధించుకున్నారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు ఎండగడుతున్నారని, దానిని కార్యకర్తలు అందిపుచ్చుకుని సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండాలని సూచించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చేవరకు ఎవరు విశ్రమించవద్దని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, అయినా వారి తీరు మారలేదన్నారు. కేసీఆర్ పథకాలు, అభివృద్ధి పనులు మీరు మరచిపోయారు. ఇప్పుడు ఆ పథకాలే బాగున్నాయని కాంగ్రెస్ వాళ్లు చెబుతున్నారన్నారు. ప్రజల కోసమే బీఆర్‌ఎస్ పని చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ చరిత్రలో మరచిపోని రోజు నవంబరు 29 అని, 11రోజుల నిరాహార దీక్ష ఫలితంగానే తెలంగాణ సాధ్యమైందన్నారు. దేశంలోనే అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్ వన్ స్థానంలో నిలిపిన నాయకుడు కేసీఆర్ అన్నారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని, రూ.4వేల పింఛన్లు, రైతుబంధు, మహిళలకు 2500, కళ్యాణలక్ష్మి తులం బంగారం ఏమైందని ఆయా వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారన్నారు. కేసీఆర్ రూ.200పింఛన్‌ను రూ.2016కు పెంచారని, రైతుబంధు ఇచ్చారని, ఇతరత్రా అనేక పథకాలను అమలు చేశారని, ఈ ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. అందరి లక్ష్యం కేసీఆర్‌ను సీఎం చేయడమే, తెలంగాణ అస్తిత్వం కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘువీర్‌సింగ్, గంట రాములు, గోపు అయిలయ్య యాదవ్, ముల విజయారెడ్డి, దాసరి ఉష, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేశోరాంలో బోనస్‌పై చర్చలు వాయిదా

పాలకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బసంత్‌నగర్ కేశోరాం పర్మినెంటు కార్మికులకు మెరుగైన బోనస్ చర్చలు డిసెంబర్ 13కు వాయిదా పడినట్లు యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గతనెల రోజుల నుంచి బోనస్‌పై జరుగుతున్న కార్మికుల ఆందోళనల నేపథ్యంలో కంపెనీ అధికారులు ఈనెల 29కి వాయిదా వేశారు. కానీ పలు సాంకేతిక కారణాలతో లేబర్ కమిషనర్‌తో జరిగిన చర్చలు వాయిదాపడ్డట్లు మనోహర్‌రెడ్డి తెలిపారు. చర్చల్లో యూనియన్ ప్రధానకార్యదర్శి దాడి మహేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేణి శ్రీనివాస్ యాదవ్, క్లబ్ సెక్రెటరీ పోతుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అంతర్గాం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అన్నారు. శుక్రవారం అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఈ మేరకు మాట్లాడారు. తూకంలో ఎటువంటి కోతలు విధించకుండా వరి ధాన్యం కొనుగోలు జరపాలని అధికారులను, కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. రైతులు పండించిన సన్నరకం వరి పంటకు ఈ సీజన్ నుంచే రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తూకంలో కోతలు విధించి రైతులను ఆర్థికంగా నష్టపరిచిందని విమర్శించారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడటమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం ఎల్లంపల్లి వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని విద్యాలయం ప్రత్యేక అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎండీ అలీం, కాంగ్రెస్ నాయకులు పెండ్రు హనుమాన్‌రెడ్డి, ఉరిమెట్ల రాజలింగం, పూదరి సత్తయ్యగౌడ్, ఆవుల గోపాల్‌యాదవ్, మడ్డి తిరుపతిగౌడ్, సింగం కిరణ్‌గౌడ్, గౌస్, ఇండబిల్లి రవీందర్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, నవంబరు 29(ఆంధ్యజ్యోతి): కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం పాపక్కపల్లి గ్రామానికి చెందిన బోరాల రాజేందర్ (30) అనే కౌలు రైతు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాపక్కపల్లి గ్రామానికి చెందిన రాజేందర్ తనకు సొంతంగా ఉన్న ఎకరంతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి పంట సాగు చేస్తున్నాడు. రెండేళ్లుగా ఆశించిన మేర పంట దిగుబడి రావడం లేదు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు సుమారు 6లక్షల రూపాయల వరకు పెరిగిపోయాయి. పంట దిగుబడి రావడం లేదని, చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపం చెందాడు. ఈ నెల 23న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కొంత సేపటికి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు రాజేందర్‌ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రాజేందర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

నాగారంలో గల్ఫ్ బాధితుడు..

కోనరావుపేట, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో గడ్డి మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన గల్ఫ్‌బాధితుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన దూస వెంకటేష్ (34) అనే యువకుడు ఆరు నెలల క్రితం రూ.3 లక్షల అప్పు చేసి ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లాడు. వెళ్లిన కంపెనీలో సరైన పని లేకపోవడం, మరో చోట పని దొరకకపోవడంతో మూడు నెలల క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. గ్రామంలో చేసేందుకు పనిలేక, అప్పులు తీర్చే మార్గం కనిపించక మనోవేదనకు గురయ్యాడు. ఈ నెల 23న గ్రామ శివారులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. వెంకటేష్‌కు భార్య సంధ్య, ఇద్దరు కూతుర్లు నిత్యశ్రీ, నయనశ్రీ ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో గురుకులాలు అస్తవ్యస్తం



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్ స్వేరో

గణేశ్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో గురుకులాలు అస్తవ్యస్తంగా మారాయని ఎస్సీఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంకటి శేఖర్ స్వేరో అన్నారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై మానవతరాయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ముకరంపుర చౌరస్తాలోని ఓ ప్రైవేటు హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవీణ్‌కుమార్ గురుకుల పర్యటన అంటే కాంగ్రెస్ వాళ్లకు భయమేస్తోందన్నారు. గతంలో ప్రవీణ్‌కుమార్ గురుకులాల సెక్రటరీగా ఉన్నప్పుడు వాటిని ప్రపంచంలోనే ఉన్నత స్థాయికి తీసుకెళ్లారన్నారు. వాటికి ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించేలా అనేక కృషి చేశారన్నారు. పిల్లలను ఉన్నత లక్ష్యాలతో గమ్యం వైపు పయనించేలా చేశారన్నారు. వందల మంది డాక్టర్లను, ఇంజనీర్లను తయారు చేశార న్నారు. దాదాపు 50దేశాలలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పిల్లలు చదివేలా చేశారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పిల్లలకు విదేశాలలో చదువుకునేందుకు ఆర్థిక స్తోమత లేని వారికి ప్రభుత్వం నుంచి విదేశీ విద్య నిధి రూ. 20 లక్షలు ఇచ్చే విధంగా అప్పటి ముఖ్య మంత్రి కేసీఆర్‌ని ఒప్పించారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో శాతవాహన ఇంచార్జి చుక్క శ్రీనివాస్. కరీంనగర్ పట్ట ణ అధ్యక్షులు బొంకూరి మోహన్, అన్వేష్. శాతవాహన ప్రెసిడెంట్ కల్యాణ్ విద్యార్థి నాయకులు సోహెల్, సాధిక్, మహేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన దివ్యాంగులు


దివ్యాంగులను అభినందిస్తున్న శైలజ

సిరిసిల్ల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రీడల్లో జిల్లాకు చెందిన దివ్యాంగులు ద్వితీయ స్థానంలో నిలిచారు. జిల్లా దివ్యాంగులు వికలాంగులు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ చేతుల మీదుగా దివ్యాంగులు సిల్వర్ మెడల్స్ అందుకున్నారు. రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రీడల్లో సిల్వర్ మెడల్స్‌ను సాధించిన దివ్యాంగులను శుక్రవారం సిరిసిల్లలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం అభినందించారు. అంతర్జాతీయం దివ్యాం గుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఈనెల 27, 28 తేదీల్లో రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రీడా పోటీలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి సీనియర్ అంధుల రన్నింగ్ పోటీలో ఎం.కార్తీ క్(వెంకటాపూర్), ఆర్థోపెడిక్ సీనియర్ షాట్‌పుట్ త్రోలో ఎం .అర్చన (చంద్రంపేట) ద్వితీయ స్థానంలో నిలచి పతకాలు అందుకున్నారు.

షార్జా ఎయిర్‌పోర్టులో నంచర్ల వాసి అరెస్టు

- విడుదల చేయించాలని ప్రవాసీ ప్రజావాణిలో దరఖాస్తు



ప్రవాసీ ప్రజావాణిలో దరఖాస్తు చేస్తున్న శ్రీధర్ తల్లి ప్రమీల

పెగడపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల గ్రామానికి చెందిన సుంకరి శ్రీధర్ యూఏఈలోని షార్జా ఏయిర్ పోర్టులో అరెస్ట్ అయ్యారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నంచర్ల గ్రామానికి చెందిన సుంకరి శ్రీధర్ బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. అక్కడ పనులు చేసి ఈ నెల 17న స్వదేశం వచ్చే క్రమంలో యూఏఈలోని షార్జా ఏయిర్ పోర్టులో పాత మొబైల్ సిమ్ కార్డు పైన మూడు లక్షల రూపాయలు (12,850 దిర్హాంలు) బాకీ ఉందని అక్కడి పోలీసులు అరెస్టు చేయడంతో జైలు పాలయ్యాడు. శ్రీధర్ పేరుపై ఉన్న పాత మొబైల్ ఫోన్ సిమ్ కార్డును ఎవరో దుర్వినియోగం చేయడం వలనే ఈ పరిస్థితి తలెత్తిందని శ్రీధర్ తల్లి ప్రమీల తెలిపారు. ప్రభుత్వం ద్వారా అడ్వకేట్‌ను నియమించి శ్రీధర్‌కు న్యాయ సహాయం కల్పించాలని, అమాయకుడైన తన కుమారుడిని షార్జా జైలు నుంచి విడిపించి ఇండియాకు తెప్పించాలని శ్రీధర్ తల్లి ప్రమీల శుక్రవారం హైదరాబాద్ బేగంపేట మహాత్మా జ్యోతిభాపూలే ప్రజాభవన్ ప్రవాసీ ప్రజావాణిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరతూ విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, గల్ఫ్ జెపీసీ నాయకులు చెన్నమనేని శ్రీనివాస్‌రావు ఉన్నారు.

ఎన్నాళ్లీ వెట్టిచాకిరి..

- 18 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులు
- రెగ్యులరైజ్ చేయాలని వేడుకోలు


సబ్‌స్టేషన్ ఆర్టిజన్ కార్మికులు



జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న నాయకులు(ఫైల్)

గణేశ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో 800 మంది ఆర్టిజన్ కార్మికులు 18 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. వీరిందరినీ పర్మినెంట్ చేస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు హామీ ఇచ్చారు. అది కార్యరూపం దాల్చలేదు. జూలై 2017లో ఆర్టిజన్ కార్మికులను విద్యుత్ శాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొంతమంది నిరుద్యోగులు ఇది అక్రమమంటూ కోర్టులో కేసు వేశారు. ఆర్టిజన్ కార్మికులు కోర్టుకు వెళ్లగా హైకోర్టుకు వారికి అనుకూలంగా సెప్టెంబరు 2018లో తీర్పు ఇచ్చింది. తర్వాత ప్రభుత్వం ఆ విషయం మరిచిపోవడంతో ఆర్టిజన్ కార్మికులు కాంట్రాక్టు పద్ధతిలోనే పని చేస్తున్నారు.

● పని భారం

ఆర్టిజన్ కార్మికులపై రోజురోజుకు పనిభారం పెరుగుతోంది. ఒక్కో సబ్‌స్టేషన్లలో ఐదుగురు చేయవలసిన పనిని ఇద్దరు, ముగ్గురితో చేయిస్తున్నారు. స్టాండింగ్ ఆర్డర్ సర్వీస్ రూల్స్ ప్రకారం ఎనిమిది గంటల షిఫ్ట్ డ్యూటీ, వారంతపు సెలవు ఇవ్వాలి. ఓవర్‌టైం చేయిస్తే అందుకు వేతనం ఇవ్వాలి. కాని ఇందుకు విరు ద్ధంగా ఎక్కువ సేపు పని చేస్తున్నారు. ఎటువంటి అదనపు వేతన ఇవ్వడం లేదు. సిబ్బంది కొరతతో వారం రోజులు డ్యూటీలో ఉండాల్సిన పరిస్థితి ఉంది. చాలీచాలని జీతాలతో, భద్రత లేని ఉద్యోగం చేస్తూ ఆర్టిజన్ కార్మికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. స్టాండింగ్ ఆర్డర్ సర్వీస్ రూల్స్ ప్రకారం గ్రేడ్ మార్పితే ఒక్కో కార్మికుడికి మూడువేల నుంచి ఐదువేల రూపాయల వరకు జీతం పెరుగుతుంది.

రెగ్యులర్ పోస్టులోకి కన్వర్షన్ ఇస్తే ప్రస్తు తం తీసుకుంటున్న జీతభత్యాలు మాత్రమే వస్తా యి. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటారు. పర్మినెంట్ చేస్తే ప్రభుత్వంపైన ఆర్థిక భారం తగ్గించేందుకు తాము ఇప్పుడు ఇస్తున్న జీతభత్యాలతోనే పని చేస్తామని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆర్టిజన్లు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరించండి..


ప్రాణాలను లెక్కచేయకుండా సేవలందిస్తున్న ఆర్టిజన్ కార్మికులను పర్మినెంట్ చేయాలి. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో 20 వేల పైచిలుకు ఆర్టిజన్ కార్మికులు పనిచేస్తున్నారు. తమను పర్మినెంట్ చేయాలని వీరందరూ కోరుతున్నారు. ప్రభుత్వాలు విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి.

- రఘునాథ్‌రెడ్డి, టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి

చాలీచాలని జీతాలతో పని చేస్తున్నాం..


చాలీచాలని జీతాలతో 18 ఏళ్లుగా విద్యుత్ శాఖలో ఆర్టిజన్ కార్మికులుగా పనిచేస్తున్నాం. గత ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులను విద్యుత్ శాఖలో విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసి నిలిపివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా మా సమస్యలు పరిష్కరించాలి.

- శివ కృష్ణ, విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు

మా సేవలను గుర్తించండి


విద్యుత్ సంస్థకు ఏళ్లుగా సేవ చేస్తున్నాం. కష్టాలు ఎదురైనా ప్రజలకు విద్యుత్ అందిస్తున్నాం. మా సేవలను గుర్తించి రెగ్యులర్ పోస్టులోక్లి కన్వర్షన్ చేయాలని కోరుతున్నాం.

- కునుసోత్ శ్రీనివాస్‌నాయక్, ఆర్టిజన్ గ్రేడ్ -1 కార్మికుడు

తప్పిపోయిన బాలుడు

- పోలీసులకు అప్పగించిన స్థానికులు


తప్పిపోయిన బాలుడు

కరీంనగర్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో శుక్రవారం ఒక ఓ బాలుడు తప్పిపోగా ఒంటరిగా రోడ్డుపై బాలుడిని చూసినవారు ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు. తప్పిపోయిన బాబు హిందీ మాట్లాడుతున్నాడని, సంబంధించిన వారు గుర్తించి తీసుకువెళ్లాలని పోలీసులు కోరుతున్నారు.

లైంగిక వేధింపు కేసులో రెండేళ్లు జైలు శిక్ష

జగిత్యాల క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ శుక్రవారం తీర్పు వెలువరించారు. పెగడపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ మైనర్ బాలికను ప్రభాకర్(25) అనే వ్యక్తి లైంగికంగా వేధించడంతో బాధితురాలు పెగడపెల్లి పోలీసులకు నాలుగేళ్ల క్రితం ఫిర్యాదు చేయగా, పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణరావు కేసును వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి ప్రభాకర్‌కు న్యాయమూర్తి జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఆరె రమేష్ (39) అనే యువకుడు శుక్రవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదానికి గురై మరణించాడు. మెట్‌పల్లికి చెందిన రమేష్ మేడిపల్లి గ్రామంలో వారి వృత్తిలో భాగంగా కుటుంబంతో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మేడిపల్లి నుంచి మెట్‌పల్లికి అతని ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ద్విచక్ర వాహనాన్ని అతి వేగంగా, నడుపుతూ ఇబ్రహీంపట్నం క్రాసింగ్ వద్ద వాహనం అదుపు తప్పి పక్కనున్న చెట్టుకు ఢీకొట్టి బండరాళ్లపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు రమేష్ భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు.

డేంజర్.. సెల్‌ఫోన్ డ్రైవింగ్

- రెప్పపాటులో ప్రమాదాలు- గాలిలో కలుస్తున్న ప్రాణాలు



సిరిసిల్ల క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సెల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరంగా మారింది. ఏ వాహన చోదకుడిని చూసినా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడమే కనిపిస్తుంది. ఇయర్‌ఫోన్స్‌తోనూ ప్రమాదాలు తప్పడంలేదు. ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని మ్యూజిక్ జోష్‌లో అతివేగంగా వాహనాలను నడుపుతున్నారు. వెనక నుంచి వచ్చే వాహనాల శబ్దం వినిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా రాజన్న సిరిసిల్ల జిల్లాలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రధానంగా ద్విచక్రవాహనదారులు చెవిలో ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని అతివేగంగా వెలుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

మ్యూజిక్ వింటూ డ్రైవింగ్..

యువత ఇయర్‌ఫోన్‌ల ద్వారా మ్యూజిక్ వినే జోష్‌లో ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని రోడ్డుపై వాహనాలు నడుపుతూ వెనుక వచ్చే వాహనాలను పట్టించుకోవడంలేదు. ఇటీవలఇయర్‌ఫోన్లు, హెడ్‌ఫోన్లు వాడకం పెరిగింది. వీటి ద్వారా బయట శబ్దాలు అసలు వినిపించవు. ఈ తరహా ఇయర్‌ఫోన్లు వాడుతూ రోడ్డు దాటడం, డ్రైవ్ చేయడం అత్యంత ప్రమాదకరం. చుట్టుపక్కల శబ్దాలు వినిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్రవాహనదారులే కాకుండా ఆటోలు, కార్లలో పెద్ద సౌండ్స్‌తో పాటలు వింటూ డ్రైవింగ్‌చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. హెల్మెట్‌లోనూ సెల్‌ఫోన్ పెట్టుకొని మాట్లాడుతూ డ్రైవ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ద్విచక్రవాహనాలు నడిపే చాలామంది హెల్మెట్‌లో సెల్‌ఫోన్ పెట్టుకొని ఇతరులతో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు. హెల్మెట్‌లోపల చెవి దగ్గర సెల్‌ఫోన్ పెట్టుకోవడంతో పక్కనుంచి వచ్చే వాహనాల హారన్ వినడపడక ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు ఫోన్‌లు పట్టుకుని చాటింగ్ చేస్తూ డ్రైవ్ చేస్తుంటారు. దృష్టి రోడ్డుపై పెట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

● **డ్రైవింగ్‌పై దృష్టి పెట్టాలి**

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు క్షేమంగా గమ్యం చేరాలి. ప్రతి వాహనచోదకుడు డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు రోడ్డుపై మాత్రమే దృష్టి సారించాలి. స్టీరింగ్ చేతిలో ఉన్నప్పుడు ఫోన్ మాట్లాడననే నియమం పెట్టుకోవాలి. ఒకవేళ మాట్లాడాల్సి వచ్చినా రోడ్డు పక్కన వాహనం నిలిపి మాట్లాడాలి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


డ్రైవింగ్ సమయంలో నిబంధనలు పాటించనివారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. సిరిసిల్లలో యువత అతివేగంగా వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మైనర్లకు వాహనం ఇచ్చే తల్లిదండ్రులపై కేసులు నమోదుచేస్తాం. వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడితే జరిమానా విధిస్తాం. **- అఖిల్ మహజన్, ఎస్పీ , రాజన్న సిరిసిల్ల జిల్లా**

యువత క్రీడల్లో రాణించాలి


మాట్లాడుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

హుజూరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే రాష్ట్రానికి, దేశానికి పేరు వస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ బాల బాలికల హాకీ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాగరాజు ఆటగాళ్లను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయన్నారు. హుజూరాబాద్ హాకీకి పుట్టినిల్లు అన్నారు. ఎంతో మంది ఇక్కడ నేర్చుకొని రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బండ శ్రీనివాస్, వర్ధినేని రవీందర్‌రావు, సబ్బని వెంకట్, టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్, సొల్లు సారయ్య, పీఈటీలు రాజిరెడ్డి, వేణుగో పాల్, సారయ్య, రవికుమార్, భాగ్యలక్ష్మి, అనిల్, శ్రీనివాస్, రేణుక, శేఖర్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో గురుకుల పాఠశాల భవనం

- ఆరుబయటే స్నానాలు, టాయిలెట్లు కరువు - తరగతి గదుల్లోనే లగేజీ - పట్టించుకోని పాలకులు, అధికారులు


గురుకుల పాఠశాల భవనం

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అనాథలు, డ్రాప్ ఔట్ విద్యార్థుల విద్యకోసం ఏర్పాటు చేసిన అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. శిథిలావస్థ భవనం, చుట్టూ విష సర్పాల సంచారం, ఆరు బయట స్నానాలు, మల మూత్ర విసర్జనలతో విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న పట్టణ గురుకుల పాఠశాల విద్యార్థుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. 46మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. 5నుంచి 8 తరగతుల విద్యార్థులకు కేవలం మూడు గదులే ఉండడంతో అందులోనే నెట్టుకొచ్చే పరిస్థితి నెలకొంది. వాష్‌రూం, బాత్రూంలలో నీరు లేకపోవడంతో వాటిని లగేజీ స్టోరేజీలుగా విద్యార్థులు వాడుకుంటున్నారు. ఉన్న ఒకే టాయిలెట్‌లో నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు కాలకృత్యాల నిమిత్తం ఆరుబయటకు వెళ్లాల్సివస్తుంది. కొన్నిసార్లు మున్సిపల్ నల్లా రాకపోతే, చివరికి ట్యాంకర్ తెప్పించి విద్యార్థులకు స్నానాలు, ఇతర అవసరాలకు వినియోగించకోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. భవనం పగుళ్లతో బిక్కుబిక్కుమంటూ వసతి, విద్యను అభ్యసిస్తున్నారు విద్యార్థులు. తమ సమస్యలపై ఇప్పటికే జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

- విష సర్పాలతో బిక్కుబిక్కుమంటూ..

జగిత్యాల పట్టణ గురుకుల బాలుర పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో కొన్నేళ్లుగా ధరూర్ క్యాంపులోని ఎస్సారెస్పీకి చెందిన గెస్ట్‌హౌస్‌లోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. భవనం చాలా ఏళ్లకింద నిర్మించింది కావడంతో పగుళ్లు వచ్చి, శిథిలావస్థకు చేరుకుంది. మరోవైపు భవనం చుట్టూ చెట్లు, పిచ్చిమొక్కలు అత్యధికంగా ఉండడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. గతంలో పాఠశాల కిచెన్‌లోకి దూరిన పామును చంపారని విద్యార్థులు పేర్కొంటున్నారు. బాత్రూంలు లేకపోవడంతో రాత్రివేళల్లో మలమూత్రాలకు వెళ్లాలంటే భయంగా ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- కూతవేటు దూరంలోనే అధికారుల కార్యాలయాలు

2017లో 13 మందితో ప్రారంభమైన పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 46 మందికి చేరింది. ప్రతియేటా విద్యార్థుల సంఖ్య నమోదు అవుతున్నా అసౌకర్యాల కారణంగా విద్యార్థులు ఉండలేక పాఠశాలను వీడి వెళ్లిపోతున్నారు. పాఠశాల భవనం సమీపంలోనే ఎమ్మెల్యే, కలెక్టర్ క్యాంపు కార్యాలయాలు ఉండడం, జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలోనే ఆయా కార్యాలయాలు అన్ని హంగులతో ఉంటే, పాఠశాల భవనం మాత్రం శిథిలావస్థలో ఉండడం గమనార్హం. పాఠశాల పరిస్థితులను గతంలోని పాలకుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాల భవనాన్ని మరోచోటుకు మార్చాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

- భోజనం పరిశీలించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు

విద్యార్థుల ఇక్కట్లపై వచ్చిన వార్తా కథనాలతో ఫుడ్ సేఫ్టీ అధికారులు పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో పాఠశాలలో కిచెన్‌ను సందర్శించి భోజన వంట తీరును పరిశీలించారు. బియ్యం, ఇతర వంట సామగ్రి నిల్వ ఉంచేందుకు ప్రత్యేక గది లేకపోవడంతో ఎలుకల వల్ల ఇబ్బంది తలెత్తే ప్రమాదం ఉందని, కూరగాయలు కోసే చోట పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కిచెన్ స్టోర్ రూంలు ప్రత్యేకంగా ఉండాలన్నారు. హాస్టల్‌లో వంట మనుషుల నిర్లక్ష్యంపై అనూష అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవస్థలు కలుగకుండా చూడాలని ఆదేశించారు.

భవనం సరిగా లేక ఇబ్బంది..


పాఠశాల భవనం పగుళ్లతో శిథిలావస్థకు చేరింది. కనీసం సరిపడా బాత్రూంలు లేవు. ఆరుబయటే స్నానాలు చేస్తున్నాం. మున్సిపల్ నల్లానీరే ఆధారం. సరిపడాగదులు అవస్థలు పడుతున్నాం. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

- రాంచరణ్, 8వ తరగతి విద్యార్థి

విష సర్పాలతో భయంగా ఉంది..


బాత్రూంలు లేకపోవడంతో రాత్రిపూట ఆరుబయటకు మూత్రవిసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. పాఠశాల పరిసరాల్లో విషసర్పాల సంచారం ఉంది. బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది.

- అశ్వంత్, 8వ తరగతి విద్యార్థి

ఇబ్బందులు గమనించాం..


అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో భవనం శిథిలావస్థలో ఉండడం, ఇరుకైన గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవడం వాస్తవమే. పాఠశాలను సందర్శించి పరిస్థితిని గమనించాం. పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తాం.

- రాము, జిల్లా విద్యాశాఖ అధికారి

రూ.7వేలు పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7వేల రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 20మంది రైతులు 127క్వింటాళ్ల విడి పత్తి, 13మంది రైతులు 18క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర .7వేలు, కనిష్ఠ ధర 6,300 రూపయాలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. 280 మంది రైతులు 4,500క్వింటాళ్ల పత్తిని సీసీఐకి మద్దతు ధర ప్రకారం విక్రయించారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

గంగాధర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల వివేకానంద విద్యాలయం విద్యార్థిని సాత్విక రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి తెలిపారు. ఈనెల 24న ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో రాజన్న సిరిసిల్లలో నిర్వహించిన పోటీల్లో సాత్విక ప్రతిభ చాటి ఎంపికైందని చెప్పారు. సాత్విక ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాత్వికను కరస్పాండెంట్ లక్ష్మారెడ్డితో పాటు ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, నర్సింగరావు, డైరెక్టర్ అనంతరెడ్డి తదితరులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పోటీల్లో రాణించాలని సూచించారు.

నకిలీ విలేకరుల అరెస్టు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిలో ఇద్దరు నకిలీ విలేకరులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. మెట్‌పల్లి నుంచి సాతారం గ్రామంలోని ఓ కిరాణ షాపునకు సామాను తరలిస్తున్న కారును పట్టణ శివారులో ఆపి బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు నకిలీ విలేకరులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన కార్తీక్, శేఖర్ అనే ఇద్దరు వ్యక్తులు వెంకటరమణ అనే వ్యక్తిని బెదిరింపులకు పాల్పడటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అక్రమ కార్యకలాపాలను అడ్డుకుంటామని తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి..

● ప్రత్యామ్నాయ పంటలపై రైతుల దృష్టి

"వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఆ దిశగా రైతులను చైతన్యపరిచేందుకు చర్యలు చేపడుతున్నది. రాయితీలను సైతం ప్రకటిస్తూ ప్రోత్సాహిస్తోంది. ఈక్రమంలో ఎలిగేడు మండలంలోని లాలపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని 12 గ్రామాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేశారు."



ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి, రైతులు

ఎలిగేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలంలోని 12గ్రామాల పరిధిలో సుమారు 120 ఎక రాల్లో రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగుచేశారు. పెట్టుబడి తక్కువ తక్కువ.. ఆదాయం ఎక్కువ వస్తుం దని అధికారులు సూచిస్తుండడంతో ఆ దిశగా రైతులు మొగ్గు చూపుతున్నారు. రైతులకు ఆయిల్‌పామ్ మొక్క లను ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తోంది. మొక్కల సంరక్షణ కోసం ప్రభుత్వం యేటా ఎకరానికి 4,200రూపాయలను నాలుగేళ్లపాటు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తుంది. మొక్కలు పెరిగి సుమారు 35ఏళ్లపాటు ఏటా ఎకరానికి 10నుంచి 16ట న్నుల వరకు దిగుబడి వస్తుందని ఉదాన్యవన శాఖ అధి కారులు చెబుతున్నారు.

● అంతరపంటలతో ఆదాయం..

లాలపల్లి గ్రామంలోని రైతులు ఆయిల్‌పామ్ తోటల్లో ఆరుతడి పంటలైన టమాట, కాకర, బూరబెండ, అల సంద, కాలీప్లవర్ వంటి కూరగాయలతో పాటు, వేరుశ నగ, మొక్కజొన్న, కీరదోస వంటి పంటలను సాగు చేస్తున్నారు. దీంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతోంది.



లాలపల్లిలో రైతులు సాగుచేసిన ఆయిల్‌పామ్ మొక్కలు

నాలుగు ఎకరాలు సాగుచేశాను..



నాకున్న వ్యవసాయ భూమిలో కొంత వరితో పాటు నాలుగు ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను పెంచుతున్నాను. ఇప్పటికి ఏడాది కావస్తుండగా అందులో కూరగాయలను సాగు చేస్తున్నాను. అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ వరిపంటకు వచ్చే ఆదాయాన్ని పొందుతున్నాను.

- బద్దం తిరుపతిరెడ్డి, లాలపల్లి

అంతరపంటగా కూరగాయల సాగు..



రెండెకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను పెట్టి, అంతర పంటగా కూరగాయలు పండిస్తున్నాను. ప్రస్తుతం టమాట, బీరకాయ పంటలు క్రాప్‌కు వచ్చాయి. అలాగే ఖాలీప్లవర్ పూతదశలో ఉంది. అంతరపంటలు వేసుకోవడం వల్ల అదనపు ఆదాయం సమకూరుతుంది.

- బి.మల్లారెడ్డి, లాలపల్లి

రైతులు ముందుకు రావాలి..



దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే ఆయిల్‌పామ్ సాగుపై రైతులను చైతన్యపరుస్తున్నాం. అంతర పంటలతో కూడా అదనపు ఆదాయం సమకూరుతుంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకుంటూ లాభదాయక పంటలవైపు మొగ్గుచూపాలి.

- అభిలాష్, ఉద్యానశాఖ ఫీల్డ్‌ఆఫీసర్

ఘాట్‌రోడ్డుపై హెచ్చరిక ఫ్లెక్సీల ఏర్పాటు



కొండగట్టు ఘాట్‌రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వద్ద సీఐ, ఎస్సై

మల్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై తరచూ జరుగుతన్న రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మల్యాల పోలీసులు డ్రైవర్లకు అవగాహన కల్పించే ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఘాట్‌రోడ్డు వెంట అయిదు చోట్ల వాటిని ఏర్పాటు చేశారు. వాహనాలను న్యూట్రల్‌లో కాకుండా గేరులోనే నెమ్మదిగా నడపాలని అందులో సూచించారు. వాహనాల పరిమితికి మించి ప్రయాణించకూడదని పేర్కొన్నారు. ఘాట్‌రోడ్డుపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై ఎ నరేశ్‌కుమార్ పరిశీలించారు. పరిమితికి మించి వాహనాలను కొండపైన నియంత్రించే చర్యలు తీసుకోవాలని, ప్రమాద నివారణ చర్యలు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈసరి జనార్దన్

సుభాష్‌నగర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెం కట స్వామి ఆధ్వర్యంలో డిసెంబరు 1న హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాలల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఈసరి జనార్దన్, కో కన్వీనర్ అర్ష మల్లేశం పిలుపునిచ్చారు. శుక్రవారం నగరం లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాలల పట్ల చూపుతున్న వివక్షను ఎదుర్కోవడం, మాలలపట్ల చిన్నచూపు వంటివి వ్యతిరేకిస్తూ తలపెట్టిన సింహగర్జన సభకు ఉమ్మడి జిల్లాలోని మాలలందరూ అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. మాలలకు జరుగుతున్న అన్యాయం సమాజానికి తెలియజేయడం కోసమే సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరా బాద్ సభకు వెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎక్కడ కూడా ఇబ్బం దులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ సమావేశంలో నక్క రాజయ్య, రొడ్డ శ్రీనివాస్, నల్లల కనకరాజు, ఎలదాసరి లింగయ్య, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక రద్దీ

- ధర్మపురి, వేములవాడలో భక్తుల ప్రత్యేక పూజలు - దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు



ధర్మపురిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి, వేములవాడ ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ విపరీతంగా పెరి గింది. లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం వరకు క్షేత్రానికి వేలాది మంది భక్తులు క్షేత్రానికి తరలివచ్చారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణాలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. మహిళలు దీపాలు, వత్తులు వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ నేతృత్వంలో అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

● 28వ రోజు గోదావరి హారతి

ధర్మపురి క్షేత్రంలో 28 రోజు శుక్రవారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, తిరుమల సేవా గ్రూపు మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా సాయంత్రం వేళలో గోదావరి నదికి శోభాయాత్ర నిర్వహించారు. రాత్రి గోదావరి మాతకు హారతి నదిలో దీపాలు వదిలారు.

● రాజన్న ఆలయానికి..

వేములవాడ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కోడెమొక్కు చెల్లింపునకు సుమారు రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు రాజన్న ఆలయ ఆవరణలో దీపాలను వెలిగిం చారు. అనంతరం అన్న, కల్యాణ పూజల్లో పాల్గొన్నారు.

● సామూహిక కార్తీక దీపోత్సవం

వేములవాడ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం రాజన్న ఆలయ కలావేదికలో సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ప్రారంభించారు. మహిళలు వివిధ ఆకృతుల్లో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కళావే దికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● ఘనంగా మహాలింగార్చన

రాజన్న ఆలయంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. కార్తీక శుక్రవారం సందర్భంగా ఉదయం ఆలయంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. రాత్రి ఆలయ అద్దాల మండపంలో లింగాకృతిలో పిండితో దీపాలు తయారు చేసి వెలిగించారు.



గోదావరి వద్ద గంగా హారతి పూజలు చేస్తున్న అర్చకులు



రాజన్న ఆలయంలో మహాలింగార్చనలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ధర్మపురి సంస్కృతాంధ్ర కళాశాలకు అంజన్న నిధులు

- అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల చెల్లింపు

- కొండగట్టుతో పాటు మరిన్ని ఆలయాల నుంచి సేకరణ

మల్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో గల శ్రీలక్ష్మీనరసింహ సంస్కృతాంధ్ర కళాశాల అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతనాల కోసం కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి ఆరు లక్షల రూపాయలు చెల్లించాలనే దేవాదాయశాఖ సూచనల మేరకు కలెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సిబ్బంది వేతనాల కోసం 32 లక్షల రూపాయలను సమకూర్చుతుండగా కొండగట్టుతో పాటు ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం నుంచి ఎనిమిది లక్షలు, వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం నుంచి తొమ్మిది లక్షలు, యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం నుంచి తొమ్మిది లక్షల రూపాయల ఆర్థికసహాయం కోరుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే దేవస్థానాల నుంచి నిధులు సమకూర్చుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతుండగా సంస్కృత భాషను కాపాడుకోవడానికేనని పలువురు పేర్కొంటున్నారు. కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న ఆగమ పాఠశాలకు కూడా నిధులు, సౌకర్యాలు, బోధన సిబ్బంది నియామకానికి ప్రభుత్వం, దేవాదాయశాఖ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సీఎం కప్ పోటీలు కరీంనగర్‌లో నిర్వహించాలి

- మంత్రి పొన్నంకు క్రీడా సంఘాల వినతి



పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చీఫ్ మినిస్టర్ కప్-2024 రాష్ట్రస్థాయి యోగా పోటీలు కరీంనగర్‌లో నిర్వహించాలని తెలంగాణ యోగా అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం మంత్రిని చిగురుమామిడిలో పలు క్రీడా సంఘాల బాధ్యులు కలిసి విజ్ఞాపనత పత్రం అందజేశారు. రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు హుస్నాబాద్ వేదికగా, రెజ్లింగ్ హనుమకొండలో నిర్వహించాలని కోరారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోని బాలాదేవితో మాట్లాడి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలు మూడు జిల్లాల్లో నిర్వహించేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, కబడ్డీ సంఘం సభ్యులు కృష్ణ యాదవ్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఎం సమ్మయ్య తదితరులు ఉన్నారు.

నేడు గోదావరి మహాహారతి

- ఏర్పాట్లను పరిశీలించిన ఉత్సవ సమితి రాష్ట్ర కో కన్వీనర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉత్సవ సమితి రాష్ట్ర కో కన్వీనర్‌రాంసుధాకర్‌రావు

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం సాయంత్రం గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందు కోసం గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కో కన్వీనర్ దామెర రాంసుధాకర్‌రావు శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించారు. స్థానిక గోదావరి నది మంగళిగడ్డ స్నానఘట్టం వద్ద మహాహారతి కోసం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ధర్మపురి క్షేత్రంలో 13 ఏళ్లుగా గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి అతిథేశ్వరానంద పర్వత, గోదావరి హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్, బీజేపీ జాతీయ నాయకుడు పోల్సాని మురళీధర్‌రావు హాజరు అవుతారు. వైదిక స్మార్త జ్యోతిష్య పౌరాణికులు పాలెపు భరత్‌శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాంసుధాకర్‌రావు కోరారు. కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులు సురేందర్‌రెడ్డి, కందాల నర్సింహమూర్తి, బండారి లక్ష్మణ్, బెజ్జారపు లవణ్, సంగి శేఖర్, లక్ష్మినర్సయ్యగౌడ్, కస్తూరి రాజన్న, సంగి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి



లక్ష్మీనరసింహస్వామి వద్ద పూజలు చేస్తున్న విశోక తీర్థ స్వామి

బీర్‌పూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉందని సత్యానంద ఆశ్రమ స్వామీజీ విశోక తీర్థస్వామి అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అఖండ జ్యోతి వెలిగించి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులతో హిందూ చైతన్య మహా పాదయాత్రను హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభించారు. పాదయాత్ర నర్సింహులపల్లి, తుంగూర్, కొల్వాయి, తాళ్ళధర్మారం, కమ్మునూర్ గ్రామాల మీదుగా యాత్ర సాగగా ఆయా గ్రామాల్లోని మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ యాత్ర కమ్మునూర్‌లో గల గోదావరి పుష్కర ఘాటు వరకు సాగింది. గోదావరి మాతకు చీరే, సారే సమర్పించి హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశోక తీర్థస్వామి మాట్లాడుతూ హైందవ ధర్మం సుభిక్షంగా ఉంటేనే ప్రపంచ శాంతి సాధ్యపడుతుందన్నారు. అనంతరం కార్యక్రమానికి ప్రధాన వక్తగా పాల్గొన్న సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌జీ మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలిగించి ప్రతీ ఒక్కరు సోదరులమే అనే భావనను పెంపొందించుకోవాలన్నారు. సామాజిక సమరసతలో భాగంగా నెల రోజుల నుంచి బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలను గ్రామాల్లోని దళిత బస్తీల్లో నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సమరసతా వేదిక రాష్ట్రసహ కార్యదర్శి పుల్లేరి రామారావు, కనికరం లచ్చన్న, సంపూర్ణ చారి, భూమా రెడ్డి, బీర్‌పూర్ దేవాలయ ప్రధాన అర్చకులు సంతోషాచార్యులు, మధు కుమార చార్యులు, సంతోష్ చార్యులు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆడెపు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా .. ఒకరికి గాయాలు

గన్నేరువరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండా పూర్ శివారులో జంగపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై శుక్రవారం టిప్పర్ అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గుండ్లపల్లి నుంచి మండల కేంద్రం మీదుగా పొత్తూరు వరకు కొనసాగుతున్న డబుల్ రోడ్డు పను లకు కాంక్రీటును తరలిస్తున్న టిప్పర్ రోడ్డు అంచు వరకు వెళ్లడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ చోటా సాకేత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు సాకేత్‌ను ఆస్పత్రికి తరలించారు.

సింగరేణి స్థలాన్ని స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం

- 60ఏళ్ల క్రితం సింగరేణి అవసరాలకు కేటాయింపు..
- ప్రభుత్వ అనుమతితో థియేటర్‌కు లీజుకు ఇచ్చిన సింగరేణి
- 25 ఏళ్ల క్రితమే థియేటర్ మూసివేత..
- తిరిగి ప్రభుత్వానికి స్థలం అప్పగింత

కోల్‌సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని నడిబొడ్డున ఉన్న రూ.40కోట్ల విలువైన స్థలాన్ని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకున్నది. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం రామగుండం తహసీల్దార్ కుమారస్వామి సింగరేణి ఎస్టేట్ అధికారి ఆర్ కుమారస్వామి నుంచి స్థలాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. ఇన్నాళ్లు లీజు హోల్డర్ల ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని సింగరేణి పూర్తిగా స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి తిరిగి అప్పగించింది. మూతపడిన ఓల్డ్ అశోక థియేటర్ స్థలం ప్రభుత్వ స్థలమని, దానిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు వినియోగించాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో సింగరేణి జనగామ శివారు సర్వే నెం.638లోని 34గుంటల స్థలాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ ఇటీవల లేఖ రాసింది. సింగరేణి లేఖను అనుసరించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాల్సిందిగా కలెక్టర్ రామగుండం తహసీల్దార్‌ను ఆదేశించారు.

సింగరేణి అవసరాలకు స్థలాన్ని ఇచ్చిన ప్రభుత్వం

1965ప్రాంతంలో సింగరేణి మైనింగ్, ఇతర అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ స్థలాలను సింగరేణికి చార్జిమెమో ద్వారా అప్పగించింది. జనగామ శివారు సర్వే నంబర్ 638 పూర్తిగా ప్రభుత్వ స్థలం. సింగరేణి స్వాధీనంలోని ఈ స్థలంలో కార్మికుల వినోద అవసరాలకు సినిమా థియేటర్ నిర్మిస్తామని ఎస్ రాజయ్య, అతని భాగస్వామ్యులు సింగరేణికి దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వ అనుమతితో సింగరేణి లీజుకు ఇచ్చింది. 150/250మీటర్ల విస్తీర్ణంతో థియేటర్‌కు స్థలం కేటాయించారు. ఆ సమయంలో యాజమాన్యం షరతులు కూడా పెట్టింది. అనంతర పరిణామాల్లో థియేటర్ యజమాని మరణించడం, ఆర్థిక వివరాలతో థియేటర్ మూతపడింది. థియేటర్‌కు కేటాయించిన స్థలంలో గదులు నిర్మించి వ్యాపారాలు చేశారు. 25ఏళ్లుగా థియేటర్ మూతపడే ఉంది. ఈ స్థలాన్ని తిరిగి తమకు అప్పగించాలని సింగరేణి లీజుదారులకు నోటీసులు ఇచ్చి ఎవిక్షన్ కూడా చేసింది. జిల్లా కోర్టుల్లో కూడా సింగరేణికి అనుకూలంగా తీర్పులు వచ్చాయి. ఇటీవల కాలంలో మూసివేసి ఉన్న థియేటర్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ నిర్మాణాలను కూల్చివేశారు. సింగరేణి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నది. ఇటీవల స్థలంపై ఉన్న కేసులో స్టే కూడా ఎత్తివేశారు. ఈ పరిస్థితుల్లో స్థలాన్ని తిరిగి రెవెన్యూకు అప్పగిస్తూ సింగరేణి నిర్ణయం తీసుకున్నది. ఓల్డ్ అశోక థియేటర్ స్థలాన్ని సింగరేణి ప్రభుత్వానికి తిరిగి అప్పగించడంతో రూ.40 కోట్ల స్థలం ప్రభుత్వ స్థలంగా మారింది. ఇక ప్రజోపయోగాలకు సంబంధించి నిర్మాణాలు, ఇతర అవసరాలకు స్థలాన్ని కేటాయించే అవకాశం ఉంది. కాగా లీజుదారు లుగా పేర్కొంటున్న వారి స్వాధీనంలో కొంత స్థలం ఉంది. దీనిపై కోర్టులో కేసు ఉందని వారు పేర్కొంటున్నారు.


స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న రెవెన్యూ అధికారులు

న్యూస్ బాక్స్

గొర్రెలకాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాములు

పెద్దపల్లిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలకాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పెద్దపల్లి మండలం పెద్దకల్వలకు చెందిన సలేంద్ర రాములు యాదవ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరియాదవ్, ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా వేల్పుల నాగరాజుయాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాత రాజు యాదవ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పలమారు మల్లేష్ యాదవ్, గొడుగు రాజ కొమురయ్య, మామిండ్ల ఐలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బత్తిని లక్ష్మణ్ యాదవ్, దాడి చంద్రమౌళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన విజిలెన్స్ మానిటరింగ్ ఎస్సీ, ఎస్టీ జిల్లా కమిటీ మాజీ సభ్యుడు కొంకటి లింగమూర్తి తల్లి మృతిచెందగా శుక్రవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి పరామర్శించారు.

ఇల్లు దగ్ధం

ఓదెల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మడకలో శుక్రవారం మేక మధునయ్య అనే వ్యక్తి ఇంటిలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. హైదరాబాద్‌లోని తన కూతురింటికి మధునయ్య వెళ్లగా మడకలోని ఇంటిలో దట్టమైన పొగ వస్తుండటంతో గ్రామస్థులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై తన సిబ్బందితో ప్రమాదస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఇంటిలోని దుస్తులు కాలిపోయినట్లు ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ఆలయంలో భక్తుల సందడి

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాగినేడు స్వయంభు నాగలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. గోదావరిఖని పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు నలుమాస ప్రభాకర్‌ను సన్మానించారు.

డివిజన్ సమస్యలు పరిష్కరిస్తా

గోదావరిఖని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ డివిజన్ వాసులకు హామీ ఇచ్చారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ ప్రజలు ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతిపత్రం ఇవ్వగా ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించానని, నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. డివిజజన్‌లో సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానన్నారు.

అమెరికాలో దీక్షా దివస్

కోల్‌సిటీటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దీక్ష దివస్ సందర్భంగా శుక్రవారం రామగుండం నియోజకవర్గా నికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వ్యాళ్ల హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో అమెరికాలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్నారైలు పాల్గొన్నారు.

క్షీరాభిషేకాలు

పాలకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సన్నరకం ధాన్యానికి బోనస్‌ను జమ చేసిన సందర్భంగా శుక్రవారం కొనుగోలు కేంద్రాల వద్ద కన్నాల పీఏసీఎస్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు.

సీఎం సభకు భారీ సన్నాహాలు

(5వ పేజీ తరువాయి)

పత్రాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేయనున్నారు. యువ కులతో పాటు మహిళలు, రైతులను కూడా ఈ సభకు తరలించనున్నారు. సభా ప్రాంగణంలో 50 వేల మందికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వపరంగా తరలించే జనమే గాకుండా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంథని, పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాల నుంచి జనాల ను తరలించేందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మె ల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు పార్టీ నాయకులతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. సభ మధ్యాహ్నం 12నుంచి 2 గంటల మధ్యలో నిర్వహించే అవకాశాలున్నాయి. ఇంకా అధికారికంగా మినిట్ టు మినిట్ షెడ్యూల్ రాలేదు. సీఎం రాకతో పెద్దకల్వల నుంచి పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్ వరకు గల రోడ్లను శుభ్రం చేయడంతో పాటు రాజీవ్ రహదారికి మరమ్మతు పనులు కూడా చేస్తున్నారు. డివైడర్లకు రంగులు వేస్తున్నారు. డివైడర్ల మధ్యలో పెంచిన చెట్లకు కూడా రంగులు వేస్తున్నారు. సభా ఏర్పాట్లను రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ, మున్సిపల్ శాఖ, రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అలాగే పోలీస్ బందోబస్తును పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సీఎం సభా ప్రాంగణానికి ఇరువైపులా సెక్యూరిటీ వింగ్‌లను పెడుతున్నారు. సభా ప్రాంగణంలో డి సర్కిల్ బయటనే వీఐపీలు, ప్రెస్, పబ్లిక్ కూర్చునేందుకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయనున్నారు. వేదిక మీదకు ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రొటోకాల్ ప్రకారం అనుమతించనున్నారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారిగా జిల్లాకు వస్తున్న సందర్భంగా సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు భారీగా జన సమీకరణ చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆందోళన


ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని సమగ్ర శిక్ష ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని జాక్ అధ్యక్షుడు తిప్పని తిరుపతి అన్నారు. శుక్రవారం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పెద్దపల్లి మండల విద్యా వనరుల కేంద్రంలో భోజన విరామ సమయంలో ఆందోళన చేపట్టారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేసిన సందర్భంగా శిబిరాన్ని సందర్శించి తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే నెలలోపు తమ సమస్యల్ని పరిష్కరిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం అధికారంలో ఉన్నందున గతంలో ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాక్ నాయకులు బాలసాని వెంకటేశం, సీఆర్పీ సంఘం అధ్యక్షుడు కుంభాల సుధాకర్, జిల్లా సీసీవో సంఘం అధ్యక్షుడు రహిమోద్దీన్, మెసెంజర్ అధ్యక్షుడు మామిడాల సంపత్, శ్రావణ్‌కుమార్, సంధ్యారాణి, రజని, శ్రీలత, పిల్లి రమేష్, కోల నాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి) : మండల శాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తక్షణమే పే స్కేల్ అమలుచేయాలని మధ్యాహ్న భోజన విరామం సమయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పీ సంధ్యరాణి, జే రమేష్, ఎస్ రమేష్, సీఆర్పీలు వీ వీరయ్య, కే చంద్రకళ, కే కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

● ముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్యాపూర్ మోడల్ స్కూల్‌లో 010 సాధన సమితి ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ప్లకార్డు ప్రదర్శించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శాంతి, చైతన్య, అశోక్, సునీత, స్వర్ణలత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆది తిరుపతి, లగిశెట్టి కుమార్, కస్తూర్బా గాంధీ పాఠశాల ఎస్‌వో జ్యోతి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ధర్మ రక్షణకు అందరూ పాటుపడాలి

- ధర్మశాస్త్ర పీఠాధిపతి శివానంద స్వామిజీ


మల్లికార్జునస్వామి ఆలయంలో శివానందస్వామితో నాయకులు

ఓదెల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధర్మరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని, మళ్లీ గ్రామానికొక శివాజీ రావాలని జోగులాంబ జిల్లా కొత్తకోట ధర్మశాస్త్ర పీఠాధిపతి శివానంద స్వామిజీ అన్నారు. మండలంలోని కనగర్తిలో ఇట్టవేని బాబురావు అందజేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శుక్రవారం శివానంద స్వామి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌లు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో శివానంద స్వామిజీ మాట్లాడుతూ ప్రస్తుతం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో మొగల్ సామ్రాజ్య పాలన కొనసాగుతోందని, రాష్ట్రంలో ఆలయాలమీద దాడులు, విగ్రహాలను ధ్వంసం చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. విచ్చలవిడిగా రాజకీయ నాయకుల విగ్రహాలు ఏర్పడుతున్నాయని, దేశం కోసం పోరాడిన త్యాగధనుల విగ్రహాలను విస్మరించారన్నారు. రాజకీయాలకతీతంగా హిందువులు ఐక్యం కావలసిన అవసరం ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ మాట్లాడుతూ శివాజీ మహారాజ్ మాదిరిగానే ధర్మాన్ని కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టే ముక్కుల సురేష్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గంట రాములు, నల్ల ఫౌండేషన్ అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి, నాయకులు శిలారపు పర్వతాలు, తంగెడ రాజేశ్వరరావు, సోమరపు లావణ్యకారెంగుల శ్రీనివాస్, కందుల శ్రీనివాస్, పులుగు తిరుపతిరెడ్డి, దామోదర్ రెడ్డి, తాళ్లపల్లి లక్ష్మణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి..

భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని జోగులాంబ జిల్లా కొత్తకోట ధర్మశాస్త్ర పీఠాధిపతి శివానంద స్వామీజీ తెలిపారు. శుక్రవారం ఆయన మల్లికార్జునస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయంలో త్వరలోనే కుంబాభిషేకం నిర్వహించాలని, ఆలయానికి నిధులను కేటాయించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో త్రిశూల్ దీక్ష

మార్కండేయకాలనీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శౌర్యయాత్ర, త్రిశూల్ దీక్ష చేపట్టనున్నట్టు జిల్లా కన్వీనర్ సంపత్ యాదవ్ తెలిపారు. శుక్రవారం స్థానిక విశ్వహిందూ పరిషత్ భవన్‌లో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1న కోదండ రామాలయ ఆవరణలో త్రిశూల్‌దీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీక్షలో 500మంది బజరంగ్‌దళ్‌లో చేరనున్నారని, అనంతరం నగరంలో కవాతు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహమూర్తి, బజరంగ్‌దళ్ కన్వీనర్ శివరాములు, వీహెచ్‌పీ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి అయోధ్య రవీందర్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి రవీందర్, సంపత్‌యాదవ్, వెంకటస్వామి, అడిగొప్పుల రాజు, రాజేశం, రావుల శ్రీనివాస్, శివ, అరవింద్, ములుకుంట్ల శ్రీనివాస్, ఆరెల్లి జలేందర్, చక్రపాణి పాల్గొన్నారు.

రేపు మాలల సింహగర్జన సభ

మంథని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో డిసెంబరు 1న మాలల సింహగర్జన బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు నాయకులు కొవ్వూరి రాజలింగు, బండారి సమ్మయ్యలు తెలిపారు. శుక్రవారం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు అప్పాల పోచమల్లు, ఎడ్ల కిష్టయ్య, వేణుప్రసాద్, సదానందం, సుదర్శన్, నాగేష్, జ్ఞాని పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి ఉత్సవాలు

మంథని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో గీతా జయంతి ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు శ్రీభగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించగా ప్రతిభను కనబర్చిన వారికి మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

పాలకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ వసతి గృహల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్ రావుఅన్నారు. శుక్రవారం మండలంలోని జయ్యారం బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి ఉదయం టిఫిన్ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వసతిగృహంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకరావాలని వసతిగృహ సంక్షేమ అధికారి మెండె సంపత్ కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పెండ్రు సాయిచరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి టిఫిన్ చేస్తున్న వేణుగోపాల్‌రావు

● సుల్తానాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలు, హస్టల్స్‌ను తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, దివ్యదర్శన్‌రావు, ఎంఈవో రాజయ్య తదితరులు తనిఖీలు చేశారు. కిచెన్‌ను తనిఖీ చేసి మధ్యాహ్నం భోజనం నాణ్యతపై ఆరా తీశారు. నాణ్యమైన ఆహారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి బాలికల ఉన్నత పాఠశాలలో అధికారులు భోజనం చేశారు.

మంథని శివాలయంలో అఖండ రుద్రాభిషేకం

మంథని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీ శీలేశ్వర-సిద్దేశ్వరాలయంలో లోక కళ్యాణార్థం వేదపండితులు వైభవంగా అఖండ రుద్రాభిషేకాన్ని శుక్రవారం నిర్వహించారు. వేద పండితులు చిల్లప్పగారి విశ్వనాథం, నల్గొండ శ్రీనివాస్, శ్రీరాంభట్ల నరహరిల ఆధ్వర్యంలో విడతల వారిగా రుత్వికులు 24గంటల పాటు నిరంతరాయంగా స్వామివారికి వేదోక్తంగా అభిషేకాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిత్యం భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. భక్తులకు, రుత్వికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు లోకే రాధాకిషన్‌రావు, లోకే శ్రీధర్‌రావు, లోకే మనోహర్‌రావులు అన్ని ఏర్పాట్లు చేశారు. చివరి శుక్రవారం కావడంతో స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్థానిక ఎల్ఐసీ నగర్‌లో కార్తీక దీపోత్స వాన్ని నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో శివ-పార్వతుల కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


రుద్రాభిషేకం చేస్తున్న వేద పండితులు

సింగరేణి సమాచారం

ఓసీపీ-1 సీహెచ్‌పీలో ఐఎన్‌టీయూసీ గేట్‌మీటింగ్


గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-1 సీహెచ్‌పీలో శుక్రవారం ఐఎన్‌టీయూసీ గేట్‌మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ ఆర్జీ-3 వైస్‌ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి మాట్లాడారు. దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. సొంత ఇంటి పథకం అమలు చేయడం, పెర్క్స్‌పై ఐటీని రీయింబర్స్ చేయడం, మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకునేందుకు రెండేళ్ళ నిబంధన సడలించాలనే అంశాలను యూనియన్ సెక్రెటరీజనరల్ జనక్‌ప్రసాద్ మంత్రులతో చర్చించినట్టు రవీందర్‌రెడ్డి తెలిపారు. సీహెచ్‌పీకి వెళ్లే దారిలో లారీలు నిలిపి ఉంచడంతో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని, ప్రత్యామ్నాయ దారి ఏర్పాటు చేయాలని, కార్మికులకు రావాల్సిన ప్రమోషన్లు, ఇన్‌సెంటివ్‌లు సమయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆర్జీ-3 అధికారులను కోరినట్టు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సీహెచ్‌పీలో మ్యాన్‌పవర్ కొరత తీర్చేలా ఖాళీలను భర్తీ చేయాలని, దుమ్ము నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోట రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ గేట్ మీటింగ్‌లో పిట్ సెక్రెటరీ కిషన్‌నాయక్, నాయకులు గడ్డం తిరుపతి, శ్రీనివాసరావు, జక్కుల దామోదర్‌రావు, మల్లయ్య, రామకృష్ణ, విద్యాసాగర్, కిషన్, చంద్రమౌళి, ప్రసాదరావు, రమేష్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ విజయవంతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఎలిగేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో డిసెంబర్ 4న జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహాసభకు రైతు, స్వశక్తి మహిళలు, కార్మికులు, కర్షకులు, యువతీ యువకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని శివపల్లి గ్రామంలో పలు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులతో జన సమీకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు మినుపాల ప్రకాష్‌రావు, గండు సంజీవ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మున్సిపల్ చైర్మన్‌లు, ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గోదావరిఖని (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో డిసెంబర్ 4న జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను జయప్రదం చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కాంగ్రెస్ నాయకులను కోరారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నగరఅధ్యక్షుడు బొంతల రాజేష్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4న జిల్లా కేంద్రంలో నిరుద్యోగ విజయోత్సవ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నియోజకవర్గం నుంచి ప్రతి గ్రామం, డివిజన్ నుంచి భారీసంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా చూడాలన్నారు. రామగుండం నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి పెద్దపల్లి నుంచే వర్చువల్ ద్వారా ప్రారంభిస్తారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా నమోదుకు డిసెంబర్ 9వరకు గడువు పొడిగించారని, దీనిని దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలు పెద్దఎత్తున ఓటరు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో మేయర్ అనీల్ కుమార్, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలకు సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, కరస్పాండెంట్ మాటేటి సంజీవ్ కుమార్‌లు తెలిపారు. గీతా జయంతిని పురస్కరించుకుని శుక్రవారం సుల్తానాబాద్‌లో విశ్వహిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీల్లో ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు స్మితికశ్రీ, సంజన, సాయి చరణ్, శ్రీ నిత్య, అక్షయ, సాహిత్య పాల్గొని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు.

ముఖ్యమంత్రి సభాస్థలిని పరిశీలించిన కలెక్టర్

పెద్దపల్లిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెద్దకల్వల సబ్‌స్టేషన్ సమీపంలో వచ్చేనెల 4న ముఖ్యమంత్రి పాల్గొనే సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. ముఖ్యమంత్రి సభా స్థలి వద్ద వాహనాల పార్కింగ్ చేసేందుకు ఎంపిక చేసిన స్థలం పరిశీలించి, అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టంగా భద్రత ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభలో గ్రూప్-4, ఇతర పోటీ పరీక్షల్లో ఎంపికైన 9వేల మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేస్తారన్నారు. ఈ సభలో రుణమాఫీ జరిగిన రైతులు, పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని కలెక్టర్ తెలిపారు.

కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బీ గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఈఈ ఆర్‌అండ్‌బీ భావ్‌సింగ్, ఈఈ పంచాయతీరాజ్ గిరీష్‌బాబు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌ను వెంటనే కోర్టులో హాజరుపరచాలి

- ఖనిలో న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో రాస్తారోకో..



రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, అజ్ఞాత దళ కమాండర్ పూనెం రమేష్ అరెస్టును ఖండించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ కోరారు. పూనెం రమేష్‌ను వెంటనే కోర్టులో హాజరుపరచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గోదావరిఖని ఫైలాన్ చౌరస్తాలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐ క్రిష్ణ మాట్లాడుతూ పూనెం రమేష్ ఇల్లందు మండలం మర్రిగూడెం పంచాయతీ ఎల్లాపురంలో ఆరోగ్యం బాగాలేక ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఈనెల 28న పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారన్నారు. రమేష్‌కు ఎటువంటి హాని తలపెట్టకుండా ఏమైనా కేసులు ఉంటే వెంటనే కోర్టులో హాజరుపరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల కోసం, ప్రజా హక్కుల కోసం, పోడు భూముల రక్షణ కోసం పోరాడుతున్న న్యూడెమోక్రసీ నాయకులపై పోలీస్ నిర్బంధం కొనసాగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. రమేష్‌కు ఎలాంటి ప్రాణహాన్ని జరగకుండా బేషరతుగా కోర్టులో హాజరుపరచాలన్నారు. ఈ నిరసనలో నాయకులు ఏ వెంకన్న, ఈ నరేష్, బీ అశోక్, కొల్లూరి మల్లేశ్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు మేరగు చంద్రయ్య, ఎం దుర్గయ్య, పైడిపల్లి రమేష్, సమ్మెట తిరుపతి, ఎం కొమురయ్య, ఐ సాంబయ్య, సదయ్య, ఏ చంద్రయ్య, జనార్దన్, మాడ స్వామి, ఆటోసాయి, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.